## క్లుప్తంగా

### రేగా, పాయం మాటల యుద్ధం

మణుగూరుటౌన్‌: ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో పినపాక నియోజకవర్గంలో నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజా, మాజీ ఎమ్మెల్యేలు సోషల్‌ మీడియా వేదికగా మాటల తూటాలు పేల్చుతున్నారు. పోడు భూముల బినామీలకు పట్టాలు ఇప్పిస్తున్నావంటూ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోషల్‌ మీడియాలో పోస్టు పెట్టారు. ప్రతిగా కాంతారావు.. ప్రభుత్వ భూములు అమ్మిన పాప అలవాటే బినామీల అలవాటు అంటూ పాయాన్ని ఉద్దేశించి పోస్టు పెట్టారు. కాగా, నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారంలో పోటీ పడాల్సిన సోషల్‌ మీడియా వేదికగా విమర్శించడంలో కాదని, అదే వేదికగా ఎవరు ఏ అభివృద్ధి చేశారో బహిర్గతం చేయడం సరైన పంథా అని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### మార్గదర్శిగా సర్పంచ్‌

అశ్వాపురం: ప్రజలకు చెప్పటమే కాదని తాను ఆచరించి గ్రామానికి మార్గదర్శిగా నిలిచాడు మండల పరిధిలోని మొండికుంట సర్పంచ్‌ మర్రి మల్లారెడ్డి. మండల గ్రామంలో ఇటీవల వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ఇటీవల సర్పంచ్‌ మర్రి మల్లారెడ్డి అధ్యక్షతన మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు గ్రామస్తులతో సమావేశమయ్యారు. దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని స్థానికులను కోరారు. దీంతో ఆదివారం తన ఇంటి ముందు గ్రామ సర్పంచ్‌ మర్రి మల్లారెడ్డి సీసీ కెమెరా ఏర్పాటు చేసి ప్రజలందరూ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు.

### రెక్కల రామక్క జాతర పోస్టర్‌ విడుదల

గుండాల: కొమరం వంశీయుల ఇలవేల్పు రెక్కల రామక్క జాతరను నెల 28 నుంచి జరుపుతుండగా వంశీయులు తెలిపారు. జాతరకు సంబంధించి ఆళ్లపల్లి మండలం మర్కోడు పంచాయతీ పెద్దూరులో ఆదివారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ జాతరలో భాగంగా మొదటి రోజు కర్రధిండుట, దేవతకు కుంకుమ పూజలు, రెండవ రోజు స్థానిక ఊరుగుట్ట నుంచి దేవతను తీసుకువచ్చి ఎదురుకోలుపు నిర్వహించి, గద్దెలపై చేర్చడంతో నిండు జాతర జరుగుతుందని వంశీయులు తెలిపారు. అత్యంత భక్తి శ్రద్ధలతో, పూజలతో ప్రారంభించిన ఈ జాతర మూడు రోజుల పాటు జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ హన్మంతు, సర్పంచ్‌ శంకర్‌బాబు, నర్సింహారావు, కొమరం వెంకటేశ్వర్లు, రాంబాబు, సత్యనారాయణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

### కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

భద్రాచలంటౌన్‌: రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా పట్టణ అధ్యక్షుడు ముసిలెట్టి రామ్మోహన్‌రావు అన్నారు. పట్టణంలోని తాత గుడి సెంటర్‌లో శక్తి కేంద్రాల్లో జరిగే స్ట్రీట్‌ కార్నర్‌ మీటింగ్‌లో భాగంగా ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకు తిరుగుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సూరత్‌ సుదర్శన్‌, నాగబాబు, వెంకన్న, శ్రీనివాస్‌, శేషు, వెంకటేశ్వర్లు, మత్తేశ్వరరావు, నాగమణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### ముస్తాబవుతున్న శివాలయం

దమ్మపేట: మండల పరిధిలోని నాచారం గ్రామంలో గుట్టపై ఉన్న జగదాంబ సమేత జయలింగేశ్వర స్వామి ఆలయాన్ని మహాశివరాత్రి వేడుకలకు అంగరంగ వైభవంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేకువ జామునే ఆలయంలో మంగళ తోరణాలు కట్టి, గణపతి పూజ, శివయ్యకు రుద్రాభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జగదాంబ అమ్మవారికి కుంకుమార్చన, స్వామి వారికి మంగళస్నానాలు, నీరాజన మంత్రపుష్పాలు, రుద్రహోమాలు వేద పండితుల సమక్షంలో జరుగుతాయని పేర్కొన్నారు. రాత్రి 8 గంటలకు జయలింగేశ్వరస్వామి శాంతి కల్యాణం, అనంతరం లింగోద్భవ కాలంలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించబడుతుందని తెలియజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### బాధిత కుటుంబానికి వితరణ

చర్ల: మండలంలోని గన్నవరంకాలనీలో రెండు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి చర్లకు చెందిన పొరవసాని బాసటగా నిలిచింది. ఆదివారం గన్నవరంకాలనీలో వెల్లెన పొరవసాని ప్రతినిధులు బాధిత కుటుంబ యజమాని ఇర్పా ప్రశాంత్‌కు రూ.8 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో చింతా వెంకటనాగేంద్రబాబు, మీసాల శ్రీనివాసరావు, మీసాల సంతోష్‌కుమార్‌, బండారి భరత్‌కుమార్‌, ఐరసవెల్లి రాము, గుడారి సాయి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల చేతిలో వెలుగులు

- సౌర విద్యుత్‌ యూనిట్లకు అవకాశాలు
- స్త్రీ నిధి రుణాలతో ప్రభుత్వ ప్రోత్సాహం
- ఉపయోగించుకుంటే ఇల్లంతటికీ కరెంట్‌



సోలార్‌ ప్యానెళ్లు..

మణుగూరుటౌన్‌: విద్యుత్‌ అవసరాలు, విద్యుత్‌ ఖర్చుల భారం ఘననీయంగా పెరుగుతున్న నేపథ్యంలో సొంతంగా సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవడానికి ప్రాధాన్యత పెరుగుతోంది. దీనివల్ల విద్యుత్‌ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునిచ్చినట్లు అవుతుంది. ఈ విషయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. వీరు సౌర విద్యుత్‌ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం స్త్రీనిధి ద్వారా రుణాలు ఇస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మణుగూరు మున్సిపాలిటీ కమిషనర్‌ సూచిస్తున్నారు.

**ఎలా నిర్మించుకోవాలి?**

నెలకు 200–300ల యూనిట్లు విద్యుత్‌ వినియోగించుకునే వారు నెలవారీ గృహ అవసరాలకు వినియోగించుకోవడానికి 2కేడబ్ల్యూ లేదా 3 కేడబ్ల్యూ యూనిట్ల సౌరవిద్యుత్‌ నిర్మించుకోవచ్చును. సోలార్‌ ప్యానెల్‌ నిర్మించుకోవడానికి ఆర్‌సీసీ శ్లాబు అనుకూలంగా ఉంటాయి. సుమారు 160 నుంచి 200 చదరపు అడుగుల రూఫ్‌ ఉండాలి. ఇందిరమైన అవకాశాలు ఉన్నవారు టీఎస్‌ఎన్‌పీడీసీఎల్‌/టీఎస్‌ఎస్‌పీడీసీఎల్‌ అనుమతితో టీఎస్‌రెడ్‌కోడీఓ వద్ద నమోదు చేసుకున్న వెండర్లు ఈసౌరవిద్యుత్‌ యూనిట్లను జీసీఆర్‌టీ ఏర్పాటు చేస్తుంది. ఎంఎన్‌ఆర్‌ఈ భారత ప్రభుత్వం వారు ఆమోదించిన మోడల్స్‌ తయారీదారు స్పెసిఫికేషన్స్‌ మాత్రమే వినియోగించుకోవాలి. ఇటువంటి గృహ సౌర విద్యుత్‌ యూనిట్లకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేస్తోంది.

**రుణ సదుపాయాలు ఎలా పొందాలి?**

మణుగూరు మున్సిపాలిటీలో ఉన్న స్వయం సహాయక బృందాల సభ్యులు టీఎస్‌ఆర్‌ఈడీసీఓ వెబ్‌సైట్‌ నుంచి తమకు నచ్చిన మోడల్‌ కంపెనీ, వెండర్‌ను ఎంపికచేసుకొనే అవకాశం స్త్రీనిధి కల్పిస్తోంది. tsredco.telangana.gov.in లేదా se@tsredco.telangana.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. దీంతో కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ కూడా మంజూరు చేస్తోంది.

సోలార్‌ ప్యానల్‌ వారంటీ 25సంవత్సరాలు ఉంటుంది. సోలార్‌ యూనిట్‌ వారంటీ 5 సంవత్సరాలు ఉంటుంది.

**ఎన్నో లాభాలు..**

సౌర విద్యుత్‌ను వినియోగించడం వల్ల కరెంటు బిల్లులు తగ్గుతాయి. నిర్వాహణ ఖర్చులు ఉండవు. ఉత్పత్తి అయిన మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసి ఆదాయాన్ని పొందవచ్చు. పెట్టుబడి కూడా 5 సంవత్సరాల్లో తీరుతుంది.

**బిల్లులు తగ్గించుకోండి**

సోలార్‌ ప్లాంట్‌ ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ బిల్లులు తగ్గించుకోండి. పర్యావరణ సమతుల్యతను కాపాడాలి. కుటుంబ ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు ఇంధన పొదుపుకు సహకరించాలి. ప్రభుత్వం కల్పించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని స్వయం సహాయక సంఘంలోని మహిళలు తమ ఇంటిపై సాధ్యమైనంత వరకు సోలార్‌ పవర్‌ ప్లాంట్స్‌ ఏర్పాటు చేసుకోవడానికి కృషిచేయాలి.

– మురళీకృష్ణ, మున్సిపల్‌ కమిషనర్‌, మణుగూరు

**సద్వినియోగం చేసుకోవాలి**

మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. రోజు రోజుకు విద్యుత్‌ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి సోలార్‌ ప్లాంట్స్‌ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సోలార్‌ ప్లాంట్స్‌ కోసం మణుగూరు మున్సిపాలిటీ కార్యాలయంలో తనను నేరుగా కలిసి పూర్తి వివరాలు పొందొచ్చు.

– నాజర్‌ అహ్మద్‌, మెప్మా టీఎంసీ, మణుగూరు మున్సిపాలిటీ

## ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన



రాజాపురం గ్రామస్తుల వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెంట్లం గ్రామంలో ముత్యాలమ్మ, కాటమయ్య ఆలయాల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల శంకుస్థాపనకు విచ్చేసిన ఎమ్మెల్యే మెచ్చాను అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం మండలంలో పలు గ్రామాల్లో జరిగిన శుభకార్యక్రమాలకు హాజరయ్యారు.

**నీటి సమస్య పరిష్కరించాలని వినతి..**

రాజాపురం గ్రామంలో శుభకార్యక్రమానికి హాజరై వస్తున్న ఎమ్మెల్యే మెచ్చాకు గ్రామంలో కొంతమంది తమ నీటి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఎంపీడీఓ రేవతితో ఫోన్‌లో మాట్లాడి నీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌, వైస్‌ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, నాయకులు భారత రాంబాబు, కొత్తూరి వెంకటేశ్వరరావు,మాధవరెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వివక్ష చూపుతున్నారు..

అశ్వారావుపేట: అశ్వారావుపేటపై స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వివక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్‌ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు ఆరోపించారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వ కార్యాలయాలను ఆయన సొంత మండలం దమ్మపేటకు తరలిస్తున్నారన్నారు. జలగం వెంగళరావు హయాంలోనే అశ్వారావుపేటలో పీయూసీ పాఠశాలను ఏర్పాటు చేశారన్నారు. కాంగ్రెస్‌ హయాంలో ఏర్పాటు చేసిన అనేక కార్యాలయాలు, రూ.కోటి ప్రజాధనంతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నిర్వీర్యంగా తయారయ్యాయన్నారు. ఏఎంసీ, ఏడీఈబ్ల్యూఓ కార్యాలయాలు అశ్వారావుపేటలోనే నిర్వహించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు అంతత మల్లిఖార్జునరావు, ఎంపీటీసీ సభ్యులు సత్యవరపు తిరుమల, కోలప్లన్‌ సభ్యులు ఎస్‌కె.పాషా, బాలగంగాధర్‌, బూసి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

## యువత అన్ని రంగాల్లో ముందుండాలి

గుండాల: గ్రామీణ యువకులు క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు, మండల ఇన్‌చార్జ్‌ కొలేటి భవాని శంకర్‌ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రేగా విష్ణు మెమోరియల్‌ చారిటబుల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో క్రీడాకారులకు వాలీబాల్‌ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు వాలీబాల్‌ కిట్లు పంపిణీ చేశామన్నారు. క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని అన్నారు. నిరుద్యోగులకు ట్రస్ట్‌ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా అన్ని వసతులు కల్పించడం జరిగిందన్నారు. మండలంలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తెల్లం భాస్కర్‌, యూత్‌ అధ్యక్షుడు సయ్యద్‌ అజ్జు, బి.రాము, గడ్డం రమేష్‌, సుభాని, రాములు, లక్ష్మీనారాయణ, ప్రమోద్‌, నర్సింహారావు, కృష్ణ, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌ క్లబ్‌ సేవలు ప్రశంసనీయం



మాజీ ఎమ్మెల్యే పాయంను సన్మానిస్తున్న లయన్స్‌ క్లబ్‌ సభ్యులు

మణుగూరురూరల్‌: మణుగూరులో లయన్స్‌ క్లబ్‌ వారు ప్రజలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని బంగారు 'గంటాస్‌ రీజియన్‌ మీట్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. నిరుపేదలకు, పేద విద్యార్థిని విద్యార్థులకు, బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు లయన్స్‌ క్లబ్‌ వారు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం అన్నారు. అనంతరం పాయంను క్లబ్‌ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఎంజేఎఫ్‌ లయన్‌ రీజియన్‌ చైర్మన్‌ గంటా రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిది క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

**సేవలకు ఘన సన్మానం**

మణుగూరుటౌన్‌: మణుగూరు మండలంలో దాన ధర్మ ట్రస్టు ఆధ్వర్యంలో విశిష్ట సేవలు అందిస్తున్న గంట రాధను ఆదివారం మణుగూరు లయన్స్‌క్లబ్‌ రీజియన్‌ మీట్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రీజియన్‌ కోఆర్డినేటర్‌ గంట రమేష్‌ మాట్లాడుతూ.. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని మారుమూల ప్రాంతమైన అశ్వాపురం గ్రామంలో రాధ దాన ధర్మ ట్రస్టు ఆధ్వర్యంలో అనేక రకాల సేవా కార్యక్రమాలతోపాటు రామాలయ నిర్మాణం, 26 జంటలకు సామూహిక వివాహాలు, ఆ కుటుంబాలకు ఆర్థిక సహాయం తదితర సేవలు అందించిందన్నారు.

గోదావరి వరదల సమయంలోనూ ఆ గ్రామ పూర్తిగా నీట మునగడంతో కుటుంబాలకు నిత్యం ఆహారం అందించడంతోపాటు వారికి కావలసిన వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. సేవారంగంలో లయన్స్‌క్లబ్‌ చేస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గంట రాధ అన్నారు. కార్యక్రమంలో మణుగూరు లయన్స్‌ క్లబ్‌ సభ్యులు సభ్యులు చంద్రమోహన్‌, రమేష్‌లు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి





మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్‌: భద్రాచలం నియోజకవర్గంలో నివాసం ఉంటూ జర్నలిస్టు వృత్తిలో కొనసాగుతున్న వారందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం భద్రాచలం నియోజకవర్గం కన్వీనర్‌ మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు ఆదివారం పార్టీ భద్రాచలం పట్టణ విస్తృతస్థాయి సమావేశం ఎంబీ నర్సారెడ్డి అధ్యక్షతన సుందరయ్య భవన్‌ భద్రాచలంలో జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల బీఆర్‌ఎస్‌ రాష్ట్ర ఆవిర్భావ సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌ జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఇస్తామని ప్రకటించారని, ఈ క్రమంలో ఖమ్మం పట్టణంలో విలేకరులకు ఇంటి స్థలాలు ఇవ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోందని, కేవలం ఖమ్మం పట్టణానికే కాకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జర్నలిస్టులుగా వృత్తి నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఎం కోరుతుందన్నారు. ఇళ్ల స్థలాల ఎంపిక విషయంలో, వివిధిదానాల విషయంలో జర్నలిస్టుల యూనియన్లు, సీనియర్‌ జర్నలిస్టులను సమావేశపరిచి వారితో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, బండారు శరత్‌బాబు, వై.వెంకట రామారావు, పి.సంతోష్‌కుమార్‌, పట్టణ కమిటీ సభ్యులు డి.సీతాలక్ష్మీ, బి.కుసుమ, యు.జ్యోతి, జీవనజ్యోతి పాల్గొన్నారు.

## ముగిసిన మైసమ్మ జాతర

అశ్వారావుపేటరూరల్‌: మండల పరిధిలోని నారాయణపురం గ్రామ శివారులో జరుగుతున్న శ్రీ కట్ట మైసమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఈ మేరకు ఆదివారం అమ్మ వారికి కుంకుమ పూజలు, కలశస్థాపన, నీరాజన మంత్ర పుష్పములు, అభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం సమయంలో అమ్మవారి ఊరేగింపును గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు, భక్తులు దర్శించుకున్నారు.

**అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే..**

మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలోని శ్రీ కట్ట మైసమ్మ తల్లి ఆలయంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ఉత్సవ కమిటీ, అర్చకులు కలిసి ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత ఎమ్మెల్యే ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, సొసైటీ చైర్మన్‌ నిర్మల పుల్లారావు, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మందపాటి మోహన్‌రెడ్డి, చందా లక్ష్మీనర్సయ్య, చిన్నంశెట్టి వెంకట నరసింహం, సుంకవల్లి శ్రీను, ఆకుల శ్రీను, సంపూర్ణ, మొటూరి మోహన్‌ పాల్గొన్నారు.

## అధికారులు తీరుపై కోర్టుకెళ్తాం..

దుమ్ముగూడెం: దళితులు క్రిస్టియన్‌గా మారి చర్చిలకు వెళుతుంటే రెవెన్యూ అధికారులు వారికి బీసీసీ సర్టిఫికెట్‌ బదులు ఎస్సీ సర్టిఫికెట్‌ ఇస్తున్నారని.. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని దళిత హిందూ మాలనాడు వెల్ఫేర్‌ సొసైటీ వ్యవస్థాపకుడు జెట్టి వెంకట్రావు అన్నారు. ఆదివారం సీతారామపురంలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బండెల సమ్మయ్య, దేగల కన్నారావు, పున్నారావు, చిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఎస్సై

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి ఎస్సైగా ఎస్‌కె.షాహీనా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీలో అన్నపురెడ్డిపల్లి ఎస్సైగా పనిచేస్తున్న విజయ కొత్తగూడెం వన్‌టౌన్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న షాహీనా అన్నపురెడ్డిపల్లికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలు సాగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

మణుగూరురూరల్‌: మహాశివరాత్రి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 18 ఆర్టీసీ మణుగూరు డిపో నుంచి కొండాయిగూడెం శివాలయానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్‌ స్వామి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సురక్షబస్టాండ్‌ నుంచి కొండాయిగూడెం శివాలయానికి భక్తుల సౌకర్యార్థం ఈ బస్సులను నడపనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## 36వ సారి రక్తదానం

భద్రాచలంటౌన్‌: భద్రాచలం పట్టణానికి చెందిన యువకుడు వసమ నవీన్‌ కుమార్‌ 36వ సారి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ప్రసవానికి వచ్చిన ఇద్దరు మహిళలకు రక్త శాతం తక్కువగా ఉండడంతో శస్త్ర చికిత్స చేయాలంటే రక్తం ఎక్కించాలని వైద్యులు కుటుంబ సభ్యులకు సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు మదర్‌ తెరిస్సా ట్రస్ట్‌ వ్యవస్థాపకుడు కొప్పుల మురళీ, సభ్యులను సంప్రదించగా.. స్పందించిన వారు నవీన్‌తో పాటు మరో దాత సహకారంతో రక్తదానం చేశారు.

## మొక్కలు నాటాలి

భద్రాచలంటౌన్‌: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని ప్రముఖ బిజినెస్‌ కాంట్రాక్టర్‌ పాకాల దుర్గాప్రసాద్‌ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్‌ సీఏస్‌పీడీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెంగల్‌రావు, ఆజీమ్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

## నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి

మణుగూరురూరల్‌: పినపాక నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న డబుల్‌ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ అద్దం కోటి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం బీఎస్పీ నాయకులు నిర్మాణదశలో ఉన్న డబుల్‌ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అద్దం కోటి మాట్లాడుతూ.. పేదలకు డబుల్‌ బెడ్రూం ఇళ్లు కట్టించి ఇస్తామని పేద, గిరిజనులకు హామీ ఇచ్చి నేటి వరకు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే రేగా కాంతారావు స్పందించి నిర్మాణాలను పూర్తి చేయించాలని డిమాండ్‌ చేశారు. నాయకులు పాక వెంకటేశ్వర్లు, నల్లగట్ల రాము, విన్నెంట్‌, గణేష్‌, సైదులు, నారాయణ, శ్రీను పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు



రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

అశ్వాపురం: హాథ్‌ సే హాథ్‌ జోడో యాత్రలో భాగంగా అశ్వాపురం మండలం గొల్లగూడెం గ్రామంలో ఆదివారం పాదయాత్ర శిబిరంలో ఉన్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్‌ పార్టీతో పాటు పలు పార్టీలు, సంఘాల నాయకులు కలిసి సమస్యలపై విన్నవించారు. వారిలో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ సీనియర్‌ నాయకుడు గాదె కేశవరెడ్డి, తూము వీరభద్రయ్యలు, మండలంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు రేవంత్‌రెడ్డిని కలిశారు.

**దివ్యాంగులు.. విభిన్న ప్రతిభావంతులు..**

దివ్యాంగుల జాయింట్‌ యాక్షన్‌ కమిటీ, తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపునేని సతీష్‌ ఆధ్వర్యంలో దివ్యాంగులు రేవంత్‌రెడ్డిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల సమస్యలపై ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చే విధంగా అసెంబ్లీలో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవతారాయ్‌, వీరబాబు, రమణయ్య, నాగేశ్వరరావు, ప్రవీన్‌ తదితరులు పాల్గొన్నారు.

**ఏఐటీయూసీ వినతి..**

అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటాలకు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్‌, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్‌, హెల్పర్స్‌ అసోసియేషన్‌ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి అరుణ ఆధ్వర్యంలో 14 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రేవంత్‌రెడ్డికి అందజేశారు.

**భవన నిర్మాణ కార్మికులు..**

భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల మల్లికార్జున్‌, మండల అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు రాయపూడి రాజేష్‌ ఆధ్వర్యంలో మండలంలోని భవన నిర్మాణ కార్మికులు రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

**జర్నలిస్ట్‌ ఫెడరేషన్‌..**

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై డెమొక్రటిక్‌ జర్నలిస్ట్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర నాయకుడు యరమల కిషోర్‌రెడ్డి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రేవంత్‌రెడ్డికి అందజేసి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

**టీఎస్‌టీయూసీ సన్మానం..**

రేవంత్‌రెడ్డిని భారజల కర్మాగారం టీఎస్‌టీయూసీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

**రిజర్వేషన్‌ విభజించాలని వినతి**

ఎస్సీల ఉమ్మడి రిజర్వేషన్‌పై పార్లమెంటులో చట్టం చేసి రాష్ట్రాలకు ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్‌లను విభజించే హక్కును కల్పించేలా పార్లమెంట్‌లో చట్టం తేవాలని కాంగ్రెస్‌ పార్టీ ద్వారా మాదిగల తరపున మద్దతు ఇవ్వాలని మాదిగ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ రిజర్వేషన్‌ వర్గీకరణపై జోడోయాత్రలో కాంగ్రెస్‌ పార్టీ విధానాన్ని బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయాలని కోరారు.


**ముంపు బాధితులు..**

గోదావరి నది ముంపు బాధితులు, నిరుపేద ప్రజల గృహ సమస్యను పరిష్కరించాలని గత రెండు వందల రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్న బాధితుల తరుపున ములుగు ఎమ్మెల్యే సీతక్క రేవంత్‌రెడ్డికి వివరించారు. గోదావరి నది ముంపు బాధితులు, నిరుపేద గృహకల్పనసాధన కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు.

# అ'పూర్వ' సమ్మేళనం



భద్రాచలంటౌన్‌: 40 ఏళ్ల తరువాత గురువులతో పూర్వ విద్యార్థులు



అశ్వాపురం: మూడు దశాబ్దాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు



దుమ్ముగూడెం: ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు..

భద్రాచలంటౌన్‌: భద్రాచలం పట్టణంలోని రంగనాయకులగుట్ట మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1982–83లో ఐదో తరగతి చదివిన విద్యార్థులు ఒకే చోటుకు చేరుకున్నారు. 40 ఏళ్ల తరువాత ఒకరినొకరు కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి పూర్వ విద్యార్థికి అరుద్రిక అరిటోరియ మొక్కను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో భద్రాచలం రామాలయం ఈఈ రవీంద్రనాథ్‌, ముల్కలపల్లి తహసీల్దార్‌ శేషుబాబు పాల్గొన్నారు.

అశ్వాపురం: అశ్వాపురం మండలం మల్లేల మడుగులోని ప్రభుత్వ హైస్కూల్‌లో చదువుకున్న విద్యార్థులు 30 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ఎంతో కాలం తరువాత కలుసుకున్న వారు వారి పూర్వ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కష్ట సుఖాలు పంచుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. ఆటా పాటలతో సరదాగా గడిపారు.

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 1977–1982 వరకు కలిసి చదివిన విద్యార్థులు ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా పాఠశాలలో కలుసుకున్నారు. పాత మధురాలను నెమరువేసుకున్నారు. దాదాపు 30 మంది విద్యార్థులు కలుసుకుని వారి జీవిత విశేషాలను ఆదిగి తెలుసుకున్నారు. యం.ఎ.హబీబ్‌, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, నర్సింహ, సరిత, కన్నమ్మ, ముత్యా మోహనసాయిరాం పాల్గొన్నారు.